# రేపు మన దేనా?

తోట వెంకటాద్రి

మావాడి ఉత్తరం చూస్తే గుండె గుభేలుమంటుంది. అంతా కులాసాగానే ఉన్నారు. అందులో వేరే పిడుగువంటి వార్త యేమీ లేదు. అయినా అంతకంటే మిక్కిలిగా బెగడు పడవల్సొచ్చింది మావాడి ఉత్తరం చూచి. కారణమేమంటే వాడొక్కడే గాకుండా, యింకో ముగ్గుర్ని వెంటేసుకొస్తున్నాడట పట్నం చూపించడానికని. ఏం వస్తే నంటారేమో! వస్తే యింట్లో బియ్యం యెక్కడున్నై? మాయిద్దరికి మూడు రేషను కార్డులు (ఒక కార్డు దొంగది లెండి) మీద వారానికొచ్చే బియ్యం మూడు పూటలకైనా చాలడం లేదాయె. అందులో యిప్పుడు రేషను సగానికి సగం తగ్గించారాయె. బియ్యం యెక్కణ్ణుంచి తెద్దాం? చుట్టాల్ని హోటలు కెళ్లి తినమంటే మర్యాదగా ఉంటుందా! ఓస్, యీ మాయన బండారం బయట పడిందోయ్ అని చెప్పటానికా, గేలిచేయటానికా!

బియ్యం లేని సమయం చూచి మా కుటుంబం మీదికి పిల్లలు దండెత్తారనీ, యిది పూర్తిగా అక్రమమనీ, యీ సమస్యను భద్రతాసంఘంలో పెడితే బాగుంటుందా? లేక భక్తపోతన సినిమాలో పోతన్నగారి భార్య సీతాదేవిని ప్రార్థించేసరికి, యింట్లో పంచభక్ష్య పరమాన్నాలూ, నవకాయ పిండివంటలూ, నాలుగు కూరలూ, తొమ్మిది పచ్చళ్ళతో సహా యింకా యెన్నెన్నో మనకు పేర్లు తెలియని వంటకాలు వాటంతట అవే పుట్టుకొచ్చినయ్యే; సీతాదేవి మనమీద శీతకన్ను వేయకుండా, యీ సమయంలో కటాక్షించితే యెంత బాగుంటుంది: వాళ్లు రాగానే వైదేహిని ప్రార్థించమని నా భార్యకు చెప్పితే! నేను పోతన్నగారి లాగు రాంభజన చేస్తూ కూర్చోవచ్చు. వంటయింట్లో మనక్కావలసినవి కుప్పలు కుప్పలుగా పడిపోవూ! యేమో! అట్లా చేస్తే వాళ్లున్నంత కాలమైనా ఒక్క బియ్యమున్నా సప్లయి అయితే అంతవరకూ చాలు. మిగతా వాటికి నాతిప్పలు నేను పడొచ్చు. లేకపోతే నేను కొంతకాలం సర్వసంగ పరిత్యాగం చేసి అక్షయపాత్ర కోసం దండకారణ్యాని కెళ్లి, పరమాత్ముణ్ణి గూర్చి తపస్సు మొదలుపెడితే!

ఆ! అట్లా జరుగుతుందా? మా ముసలమ్మ ప్రకారం, అలనాడు ఆ సత్యకాలంలో అటువంటి మహిమ ఉన్నదంటే, యేమో ననొచ్చు గాని యీ కాలంలోనా అట్లాంటిది జరగడం! ఏమో ఒకసారి ప్రయోగం చేసి చూద్దామని అనుమానం పీడిస్తూనే ఉంది.

అసలు యీ ఆహార సమస్య ముఖ్యంగా పట్టణాల్లో యేకుమేకై కూర్చుంది. ఈ శరీరాలకు బియ్యం వినా యితరం యేదీ పడిచావదు. నాకు గోధుమరొట్టె గిట్టదు, శ్రీమతికి జొన్నరొట్టె చేదు. నే నిదీ, శ్రీమతి అదీ, తిందామూ అంటే బోలెడంత చాకిరీ, రైలింజన్లో కాలినట్టు కుంపట్లో బొగ్గులు కాలడం, నేతిఖర్చు వగైరా చాలా నల్చుకుంటుంది. బియ్యం చాలడం లేదని బ్లాకుమార్కెట్టులో కొందామూ అంటే, అట్లా చేయడానికి తగిన సమయం, తగిన నైపుణ్యం, తగిన మనుషులూ అంతా కావాలి. ఒకవేళ యే అయిదురూపాయలవో పట్టుకొస్తుంటే, ఏపోలీసు వాడి కంట్లోనో పడితే కొంప నిలువునా అరుతుంది. వాడి పాడు కూతలు పడిందే గాకుండా, అయిదో పదో వాడికి సంభావన యిచ్చుకోవాల్సి వస్తుంది. వాడసలు ఆ బియ్యంమూట లాక్కుని వెళ్లినా అదేం అనడానికి వీలుండదు. వాడటువంటివాడు గాకపోతే, కేసు, దానిమీద నాటకం జరిగి జరిమానాలూ, లేనిపోని అప్రతిష్ఠా. అప్పుడు మన మనుకోని పరిణామాలూ యెన్నో కలుగుతాయి. ప్రభుత్వంయిచ్చే రేషను చాలదూ, పైగా యెక్కణ్ణయినా కొనుక్కుంటే శాసన విరుద్ధం అని శిక్షా. కొనబోతే కొరివి, అమ్మబోతే అడవిమూదిరిగా ఉంది మన పని.

అయినా యెన్నిరోజులని బ్లాకుమార్కెట్లో కొనగలుగుతాం? బ్లాకుమార్కెటుద్వారా సంపాయించిన డబ్బుందా, లేక పెద్దలు సంపాయించిచ్చిన చద్ది యేమయినా ఉందా? ఏమీ లేదు. కేవలం పొద్దుట్నుంచీ సాయంత్రందాకా నెల రోజులు విడవకుండా యెముకలు విరగ్గొట్టుకుంటే వచ్చే ఆ నూరూ, నూటపాతిక రూపాయల్తో యెన్నాళ్ళని బ్లాకుమార్కెట్లో కొనుక్కొని తిని జీవించగలం? ఇంటద్దె, దినవెచ్చం, పట్నవాసం ప్రసాదించిన కొత్త కొత్త రోగాల కయ్యే ఖర్చులూ, ఇంకా మనకు తెలియని బాధకులూ- వీటన్నిటికీ యెక్కణ్ణుంచి తేగలం? ఆ జీతం అన్నా పెరుగుతుందనుకుంటే 'జీతము గొర్రెతోక పనిసేతకు గాడిదవీపు మోత, ప్రఖ్యాతిగొప్ప శాస్త్రి, ఇంక నధికారము జాలక బోడిమేక'గా ఉందయ్యే ఉద్యోగలక్షణం! మన మేదో పెద్ద ఉద్యోగం యేడుస్తున్నామని ఓ లేనిపోని పేరూ! ఇంటిదగ్గర ఎప్పుడన్నా మా గ్రామానికెళ్తే 'వాడికేం, రాజుబిడ్డలా భార్యతో పట్నంలో ఉంటున్నాడు' అంటారు అమ్మలక్కలూ, అయ్యలన్నలూ. పాపం, వాళ్ళ అమాయకత్వానికి నాకెంతో జాలేస్తుంది. పట్నవాసం అన్నమాటే గాని, లోపలిగుట్టు పెరుమాళ్ళకుకూడా తెలియదు. యిక్కడ అర్ధాకలితో చస్తున్నాం అని వాళ్ళకేం తెలుసు! పై డాబుసరికి యిస్త్రీ బట్ట లేసుకుని ఒక్కసారి ఒక్క మెరుపు మెరవగానే వాళ్ళంతా దిగ్భ్రమ చెందుతారు. అసలు సంగతి తెలిస్తే యేడుస్తారో నవ్వుతారో మరి!

మా యింటి యజమాని లక్షాధికారి. పిల్లా టీరకాయ యెవ్వరూ లేదు. నన్ను పెంచుకోకూడదూ? యే లాటరీలోనన్నా ఓ ఛాన్సు దొరకకూడదూ? పూర్వులు యెప్పుడో భూమిలో పాతిపెట్టిన ఓ లంకెల బిందె ఒకటి దొరక్కూడదూ? బిందె అంతా ఎందుకూ? పావు బిందైనా జీవితాంతం వరకూ సెటైయ్యొచ్చు. దొరికితే, యింటికి మహాకీడట. యింట్లో వాళ్ళంతా ఒకళ్ళ వెంబడి ఒకళ్ళు హైనలా కావల్సిందేనట! లేకపోతే సినిమాల్లోమాదిరిగా ఓ భాగ్యవంతుడి బిడ్డ మనల్ని ప్రేమించ కూడదూ! మనల్నా ప్రేమించేది! అథవా ప్రేమించిందనుకోండి. మనం ఆమెను ప్రేమించి పెండ్లిచేసుకోడానికి నిశ్చయించుకుంటాం అనుకోండి. మరి అగ్నిసాక్షిగా అందరిముందు పెళ్ళాడి, నా కష్టసుఖాల్లో పాలు పంచుకోడానికి దేశం కాని దేశం వచ్చిన నా మొదటి భార్య సంగతేమిటి? కొత్త కాంతతో బాటు కనకం కూడా వస్తుందని మొదటి భార్యను విడనాడమా, లేక, యిద్దర్నీ అట్లాగే ఉండనిస్తామా? ఒక ఒరలో రెండుకత్తులు యిముడుతాయా!

ఒకానొక దొంగ అనేక సార్లు కృష్ణ జన్మస్థానం చూచి కూడా మళ్ళీ దొంగతనం చేసి పట్టుబడ్డాడట. మేజిస్ట్రేటు 'అబ్బాయ్! నీకు పెండ్లి యిందిరా!' అని దొంగను అడిగేట్ట. 'అయింది దొరా!' అని దొంగ జవాబిచ్చేట్ట. 'అయితే వీడికింకో పెండ్లి చేయండిరా' 'అయ్యా! నాకు ఉరిశిక్షన్నా వెయ్యండి గాని పెళ్ళాం వుండగా యింకో పెళ్ళాం వొద్దు.' అని దొంగ ప్రార్థించాట్ట. అయితే మన యీ సమస్యకు పరిష్కార మార్గమేమిటి? మన శ్రీ గౌరవనీయ ఆహార మంత్రులవారు వారానికో రోజు అచ్చంగా కూరగాయలు తినమని ఉపదేశించారు.

వారి సెలవుప్రకారం వారానికొచ్చే బియ్యం ఒకరోజూ, యింకోరోజు కూరకాయలూ తింటాం. అంటే మిగతా అయిదు రోజులూ యేం చేయాలి? బజార్లో మిఠాయిలు కొనుక్కొని తినాల్నా? సరే మన మంత్రులవారు చెప్పినట్లు, ఓ అర్థ రూపాయికో, ముప్పావలాకో కూరగాయలు కొనితెస్తాం. శ్రీమతికి మంత్రులవారి మాటలు నచ్చచెప్పి వాటితో వంటచెయ్యమంటామనుకోండి. అవన్నీ కూర వండి కూరక్కూరే తినాలా లేక పచ్చి వే



ఆహారంగా కొరుక్కుతినాలా? విరేచనాలు పట్టుకుంటే! అసలే రోగాల్తో చస్తున్న వాళ్లకు మళ్ళీ యింకో రోగమా? దాంతో ప్రయివేటు డాక్టరు దగ్గరకు పోతే మంచినీళ్ళిచ్చి దబ్బోవిలించడం, ఉస్మానియా జనరల్ హాస్పిటాలుకు పోతే, వాళ్ల సీసాల్లోది యేదో రెండుడోసులు మన సీసాలో పోసి, ఫలానామాత్రలు బజార్లో దొరుకత్తై, కొనుక్కోని వాడండి అంటూ డాక్టర్లు సలహా యివ్వడం, యెక్కణ్ణో మారుమూలకు జరుగుతున్న యుద్ధం సాకుగా మందుల ధరలుగూడా పెరిగిపోయె. అయితే మంత్రుల గారి సలహా యేం చేయాలి? పాపం, మంత్రి పదవిలోకి వచ్చి రాంగానే, యెంతో కష్టపడి యిచ్చిన వారి సలహాను త్రోసిపుచ్చితే! రోగాల కలవాటు పడిన మీ శరీరాలకు, దీనివల్ల వచ్చే కొత్తరోగంవల్ల యేం ప్రమాదం ఉండదంటూ, మళ్లీ శ్రీ మంత్రిగారు ఓ ప్రకటన చేయొచ్చు.

మొన్న గమ్మత్తేమయిందంటే, మా వాళ్లంతా సమ్మెజేశారు. జీతం యెక్కువ గావాలని. వీళ్ల మాటలు వింటే, అధికారుల ఆదరాభిమానాల్ని కోలుపోతామని నేను సమ్మెలో జేరకుండా ఊరుకున్నా. అందరూ నన్ను సమ్మె ద్రోహి అనీ, అధికారుల బూట్లు నాకే కుక్కవనీ నిందించారు. ఈ గోలపడలేక, మళ్లీ తరవాత జరిగిన సమ్మెలో పాల్గొంటే సమ్మె చేసినన్నాళ్ల జీతం తెరుకువరం అయింది. అన్ని విధాలా చావే వచ్చింది. యేం చెయ్యాలి?

'ముందు ముందు దేశం బాగుపడుతుంది. కొంచెం ఓపిక పట్టవోయ్! అంత తొందరయితే యెట్లా!' నంటాడు ఓ మిత్రుడు. 'గాంధీగారు కలలు గన్న రామరాజ్యం రావాలోయ్' అంటాడు యింకో మిత్రుడు.

వచ్చే ఎన్నికల్లో మేం పాల్గొంటున్నాం. అందరికీ తిండీ, బట్టా, యిల్లూ వాకిలీ దొరికేటట్టు చేస్తాం. మీ ఓట్లన్నీ మాకే వెయ్యండి' అంటాడు మరో మిత్రుడు.

'సాయుధ విప్లవం ద్వారా, పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి దానిస్థానే నిజమైన కూలీ రైతు ప్రజారాజ్యం స్థాపించిందాకా, యీ పీడిత జాతికి విముక్తిలేదు' అంటాడు వేరొక మిత్రుడు.

'ఆగండాగండి! యింకా మేము కాలు నిలువదొక్కుకోలా. అంతర్జాతీయ పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నై. వాటి కనుగుణంగా నడుచుకోవాలి. మీ సేవ చేయడమే మా విధి' అంటారు మన నాయక మహానాయకులు.

ఇందులో యెవరిమాట వినాలి? కడుపు కాలుతుంటే, కావల్సింది యింత కూడా లేక యిటువంటి ఉద్ఘాటింపులా! అసలంత వరకూ బ్రతికేదెట్లా? వారు వారు సాధించాల్సిన లక్ష్యాలు సాధించబడే వరకూ!

బీహారు బెంగాల్లో ఘోరక్షామం బయలు దేరిందట అప్పుడే. ఆకలి చావులని వార్తలు వస్తున్నై. ఆకూ అలం తిని ప్రాణాలు బిగపట్టుకొంటున్నారట. ఎంతో మంది, కుటుంబాల్ని పోషించుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని రోజూ పత్రికల్లో చూస్తున్నాం. విశాఖపట్నం జిల్లాలో తాటిగుజ్జూ ఈతగుజ్జూ తిని బ్రతుకుతున్నారట. ఇంతలోకే మళ్ళీ భారతదేశంలో యింకో కరువా?

నే నెన్నో పత్రికలకు కథలూ, వ్యాసాలూ రాశాను. అందుకు ఖర్చయిన అమూల్యమైన నా జీవశక్తిని యెవ్వరూ తిరిగి యివ్వలేనప్పటికీ, కాయితం సిరా ఖర్చన్నా యే పత్రికా సంపాదకుడూ యిదిగో అంటూ పంపించిన పాపాన పోలేదు. ఎవర్ని ఉద్ధరించుదామని యీ రాత కోతలు, నాకై నాకు ఉపయోగం లేనప్పుడు? ఏదో మనస్సులో ఉన్న బాధనూ, బరువునూ తగ్గించుకోడానికి తప్ప ఆలోచించడానికి అలవాటుపడ్డ తలా, రాయడాని కలవాటు పడ్డ చెయ్యీ ఊరుకోనివ్వక కాని. అయితే యీ సమస్య పరిష్కారం అయ్యేదెట్లా?

రేపు మనదే భయపడబోకన్నాడు ఓ మిత్రుడొచ్చి. రేపు మనదా? కాదు. ప్రతి రేపూ ఒక కొత్త చిక్కు తెచ్చిపెట్టి చావగొడుతుంటే రేపు మనదెట్లా అవుతుంది? అయితే నిన్న మనదే అనొచ్చు, నిన్నటి ఊబిలోనుంచి యెట్లోకట్లా తెమిలి బైటబడ్డాం. నిన్నను దాటాం. కాబట్టి నిన్న మనదే అంటే బాగోదూ? సరే! రేపటి గండం: చుట్టాలొచ్చే సరికి యేదో యేర్పాటు చెయ్యాలి. చెయ్యకపోతే మాట దక్కదు. పరువుపోయినా మర్యాద నిలబెట్టుకోవాలి.